సాగుకు సన్నద్ధం


పతివాడలో పొలాన్ని దుక్కి చేస్తున్న రైతులు

- ముందుగానే పలకరించిన తొలకరి
- ఖరీఫ్ సాగు పనుల్లో రైతులు బిజీ
- ఆర్‌బీకేల్లో అందుబాటులో విత్తనాలు, ఎరువులు

పూసపాటిరేగ: ఈఏడాది తొలకరి జల్లులు ముందుగానే పలకరించడంతో అన్నదాతల్లో ఆనందం నెలకొంది. వాతావరణం పూర్తిగా చల్లబడి వ్యవసాయానికి అనుకూలంగా మారడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తం అవుతున్నారు. ఏటా జూన్ నెలలో ఖరీఫ్ సాగు పనులు ప్రారంభమయ్యేవి. అయితే ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే రావడంతో మే నెలలోనే చెదురుమదురు జల్లులు కురవడంతో మే నెలాఖరులోనే రైతులు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు చేస్తున్నారు. పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ, నెల్లిమర్ల మండలాల్లో రైతులు ఖరీఫ్‌లో ప్రధాన పంటగా వరి సాగు చేస్తారు. పొలాలను దుక్కి చేసి నారుమడులు సిద్ధం చేసే పనిలో అన్నదాతలు బిజీగా ఉన్నారు. మరోవైపు ఖరీఫ్ అవసరమైన విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు పెట్టుబడులు సిద్ధం చేసుకుంటున్నారు. కొంతమంది రైతులు భూసారం పెంచేందుకు పొలాల్లో పచ్చిరొట్ట పంటలు వేస్తున్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు జీలుగ, పిల్లిపెసర, జనుమను తదితర పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తుండటంతో ఈ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. విత్తనాలు వేసుకున్న 40 రోజుల తరువాత పంటను పొలంలో కలియ దున్నడం వల్ల అందులోని పోషకాలు భూమిని చేరి సేంద్రియ ఎరువుగా మారుతుంది. అలాగే రైతులు ప్రైవేటు డీలర్ల వద్ద ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



ఖరీఫ్ సాగుకు ముందు రైతులు భూసారం పెంచుకునేందుకు పచ్చిరొట్ట పంటలు సాగు చేయాలి. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు జీలుగ, పిల్లిపెసర, జనుము తదితర విత్తనాలను 50 శాతం రాయితీపై అందిస్తున్నాం. కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో సంప్రదించాలి. పచ్చిరొట్ట పంటను ఖరీఫ్ దుక్కుల్లో కలియ దున్నడంతో అందులోకి పోషకాలు నేలను చేరి సారవంతం అవుతుంది. రసాయన ఎరువులు వాడకం తగ్గుతుంది. భూమి గుల్లబారి సాగులో అధిక దిగుబడులు వస్తాయి.
– కొల్లి నీలిమ, మండల వ్యవసాయ అధికారి, పూసపాటిరేగ

స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం: స్థానిక కోట జంక్షన్ వద్ద ఉన్న విజయ బ్లడ్ బ్యాంక్‌లో విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి పట్టణవాసుల నుంచి అపూర్వ స్పందన లభించింది. జిల్లాలోని బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వల కొరత కారణంగా తలసేమియ, సికిల్‌సెల్ ఎనీమియ, రక్తహీతన, డయాలసిస్ రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రక్త నిల్వలు సేకరించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తామాష్ తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన హలో కిచెన్ ఎండీ కోలగట్ల ప్రతాప్ మాట్లాడుతూ.. పూర్తి ఆరోగ్యంతో ఉన్నవారు మూడు నెలల కోసారి రక్తదానం చేయవచ్చన్నారు. మీరు చేసే రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడుతుందన్నారు. ఈ శిబిరంలో 86 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతో నిర్వాహకులు దాతలను అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో యూత్ ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయి కుమార్, రాయల్ క్యాబ్స్ శరత్, విజయ్, రఘు, వినయ్, వికాస్, రఘు, రాజు, విజయదుర్గ ఫౌండర్ కేశవపట్నం చంద్రిక, వీహెచ్‌ఓ ఫౌండర్ రాము, అరవింద్, బ్లడ్ బ్యాంక్ మేనేజర్ పుణ్యమంతుల శివ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యం


మాట్లాడుతున్న డాక్టర్ డీవీ శ్రీకాంత్

- బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ డీవీ శ్రీకాంత్

విజయనగరం టౌన్: నిరుపేదలందరికీ ఉచిత వైద్యం అందించడమే తమ లక్ష్యమని బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ డీవీ శ్రీకాంత్ అన్నారు. సమాఖ్య ఆరోగ్య గాయత్రీ పేరుతో అన్నివర్గాల నిరుపేదలకు ఉచిత వైద్య సదుపాయం అందించే సదుద్దేశంతో ఏడాది క్రితం ఆరోగ్య విభాగాన్ని ప్రారంభించారు. రాజీవ్‌నగర్ కాలనీలోని గాయత్రీ భవన్‌లో ఆదివారం తొలి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీరోజూ ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ ఉచిత వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఏడాదిలో సుమారు 1000 మంది వరకూ వైద్య సేవలను వినియోగించుకున్నట్లు చెప్పారు. ఈ ఏడాది 2500 మందికి ఉచిత వైద్యం అందించేందుకు సమాఖ్య కృషిచేస్తుందన్నారు. సమాఖ్య గత 38 ఏళ్లుగా సమాజంలో విద్యాదత్తత ప్రతిభా పురస్కారాలను అందిస్తోందని, ఈ ఏడాది జూలై 14న ప్రతిభా పురస్కార మహోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. జూన్ 10 నుంచి 20 వరకు దరఖాస్తులు గాయత్రీ భవనంలో అందిస్తామన్నారు. సమాఖ్యలో ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న జీఎస్‌రావుకి జీవిత సాఫల్య పురస్కారం అందజేశారు. సీనియర్ వైద్యులు సి.రఘురామ్‌తో పాటు ఆరోగ్య గాయత్రీలో సేవలందిస్తున్న 13 మంది వైద్యనిపుణులను, 12 మంది వలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు నేమాని భద్రాద్రి సీతారామం, అధ్యక్షుడు పీవీ రమణమూర్తి, కార్యదర్శి వీవీ నరసింహమూర్తి, కోశాధికారి కె.సత్యం, కన్వీనర్లు చక్రవర్తి భరద్వాజ్, భోగరాజు సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు


అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వైశాఖ మాసం తొలి ఆదివారం కావడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావ డంతో క్యూలైన్లు నిండిపోయాయి. అమ్మవారికి తెల్లవారు ఝామున 5 గంటల నుంచే అర్చకు లు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం చేశారు.


అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు

నేటి నుంచి శ్యామలాంబ పండగ

గుర్ల: మండలంలోని దమరసింగి గ్రామంలో శ్యామలాంబ అమ్మవారి పండగను సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు ఆది వారం తెలిపారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం కనుమ పండగ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పండగకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

29న మండల సర్వసభ్యసమావేశం

గజపతినగరం రూరల్: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరుకావాలని కోరారు.

జూన్ 7 నుంచి బ్రహ్మోత్సవాలు

గజపతినగరం: స్థానిక బజారు సెంటర్‌లోని సీతారాముల ఆలయంలో స్వామి వారి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలను జూన్ 7 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గజపతినగరంతో చుట్టు పక్క గ్రామాల భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జాబ్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

దత్తిరాజేరు: ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆ పథకం ఏపీఓ అప్పల నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. గ్రామాల్లో స్థిరనివాసం ఉన్న వారు జాబ్ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జెరాక్స్ కాపీ, ఫొటో ఇస్తే వారే దరఖాస్తులను ఉపాధి హామీ కార్యాలయానికి అందజేస్తారని పేర్కొన్నారు. దరఖాస్తులను పరిశీలించి, అర్హులందరికీ జాబ్ కార్డులు అందజేస్తామని స్పష్టం చేశారు.

పంపిణీకి సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు

దత్తిరాజేరు: మండలంలోని 17 రైతుభరోసా కేంద్రాల్లోనూ రైతులకు రాయితీపై పంపిణీ చేసేందుకు పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏఓ అనురాధ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పచ్చిరొట్టసాగుతో భూసారం పెరుగుతుందని, తద్వారా ప్రధాన పంటకు రసాయన ఎరువుల వినియోగం తగ్గించవచ్చని పేర్కొన్నారు. కట్టె జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను 50 శాతం రాయితీపై అందిస్తామని, రైతులు గ్రామ సచివాలయాల్లో వీఏఏల వద్ద పేర్లు నమోదు చేసుకుని, విత్తనాలు తీసుకోవాలని సూచించారు.

చీపురుపల్లిలో కార్డన్ సెర్చ్


సంగువారిమెట్టకాలనీలో పోలీస్ సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న ఎస్‌ఐలు

చీపురుపల్లి: పట్టణంలో సంగువరిమెట్ట కాలనీలో స్థానిక ఎస్‌ఐ కె.కిరణ్ కుమార్‌నాయుడు, గరివిడి ఎస్‌ఐ దామోదర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేశారు. ఎలాంటి పత్రాలు లేని 22 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను గుర్తించి వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాటికి సంబంధించిన పూర్తి వివరాలు పరిశీలిస్తున్నట్లు ఎస్‌ఐలు చెప్పారు. జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు గ్రామాల్లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నట్లు సమాచారం ఉందని, గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కోలగట్ల పుట్టినరోజు వేడుకలు రేపు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు

విజయనగరం: డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పుట్టినరోజు సందర్భంగా ఈనెల 28న పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు వెల్లడించారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. 28న ఉదయం స్థానిక సుజాత ఫంక్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. పార్టీ యువజన, విద్యార్థి విభాగాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కోలగట్ల నివాసం వద్ద భారీ కేక్ కటింగ్ ఉంటుందన్నారు. అలాగే ఆరోజు పట్టణంలోని పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆస్పత్రులు, వృద్ధాశ్రమాల్లో పండ్లు, రొట్టెలు, ఆహారం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్ అల్లు చాణక్య, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జోనల్ ఇన్‌చార్జిలు కుమ్మరిగుంటి శ్రీనివాసరావు, మారం బాలబ్రహ్మారెడ్డి, రెడ్డి గురుమూర్తి, బోడసింగి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గుట్టుచప్పుడు కాకుండా గుట్కా విక్రయాలు

- ఒడిశా నుంచి దిగుమతి
- పట్టించుకోని స్థానిక అధికారులు
- పెడతోవ పడుతున్న యువత


పట్టణంలోని ఓ దుకాణంలో విక్రయానికి ఉంచిన గుట్కా ప్యాకెట్లు

నెల్లిమర్ల: నెల్లిమర్ల పట్టణంలో నిషేధిత గుట్కా విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. పాన్ షాపుల్లోనూ, కిరాణా దుకాణాల్లోనూ గుట్కా, ఖైనీ విక్రయాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. పట్టణానికి చెందిన ఇద్దరు వ్యాపారులు ట్రైన్‌లో ఒడిశా నుంచి వాటిని తీసుకొచ్చి నెల్లిమర్ల పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వ్యాపారులకు సరఫరా చేస్తున్నారు. గత కొంతకాలంగా ఈ వ్యవహారం గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతోంది. సంబంధిత అధికారులకు ఈ సంగతి తెలిసినా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. నెల్లిమర్ల పట్టణ కేంద్రంగా నిషేధిత గుట్కా, ఖైనీ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోంది. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉంటున్న ఒక వ్యాపారితో పాటు గాంధీనగర్ కాలనీకి చెందిన మరో వ్యాపారి గుట్టుచప్పుడు గాకుండా ఈ వ్యాపారం సాగిస్తున్నారు. నిత్యం ఒడిశా నుంచి రైళ్లలో రహస్యంగా తీసుకొస్తున్నారు. ఇళ్ల వద్దనే గుట్టుగా నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన చిరు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో పట్టణంలో ఈ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. అన్ని పాన్ షాపుల్లోనూ, కిరాణా దుకాణాల్లోనూ నిషేధిత గుట్కా, ఖైనీ విచ్చలవిడిగా లభ్యమవుతోంది. దీంతో పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి అక్రమ గుట్కా, ఖైనీ వ్యాపారాన్ని నియంత్రించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

హద్దు మీరితే చర్యలు తప్పవు: సీఐ


తిప్పలవలస గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

పూసపాటిరేగ: జూన్ నెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని భోగాపురం రూరల్ సీఐ బి.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని తిప్పలవలస గ్రామంలో ఆదివారం పర్యటించారు. ఎన్నికల కోడ్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎన్నికల ఫలితాలు వెల్లడైన తరువాత ఎటువంటి ర్యాలీలు, ఊరేగింపులు చేసినా, బాణసంచా కాల్చినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురు కంటె ఎక్కువ మంది గుంపులుగా తిరగవద్దని సూచించారు. ఇప్పటికే గొడవలు, కేసుల్లో ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టామని, అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించేవారిపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎస్సై ఎ.సన్యాసినాయుడు ఉన్నారు.

యువ కవులకు స్ఫూర్తిప్రదాత ఆచార్య భావన్


సీనియర్ జర్నలిస్ట్ కానూరి బాపూజీని సత్కరిస్తున్న విజయభావన సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: ఎందరో యువ కవులను తయారుచేసిన స్ఫూర్తిప్రదాత డాక్టర్ ఆచార్య భావన్ అని హైదరాబాద్‌కి చెందిన సీనియర్ జర్నలిస్ట్ కానూరి బాపూజీ అన్నారు. విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఆచార్య భావన్ 28వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. జాషువా కవిత్వంపై పరిశోధనలు చేసిన భావన్.. జాషువా కవితల్లోని తత్వాన్ని తెలుగు ప్రజలకు వివరించారన్నారు. అనంతరం ప్రధాన వక్తను సమాఖ్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ముందుగా భావన్ చిత్రపటానికి కుటుంబ సభ్యులు, సమాఖ్య ప్రతినిధులు, ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభాధ్యక్షుడిగా ధర్మపురి డిగ్రీకళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎల్ఎన్.మూర్తి, సమ్మానకర్తగా సమాఖ్య ఉపాధ్యక్షుడు భోగరాజు ఖాదరవలీ బాబూజీ వ్యవహరించారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు, దశగ్రంథాల సుబ్రహ్మణ్యం, భావన్ మనవడు పీఎస్‌వీ శేషాచార్యులు, దామరాజు శంకరం, భైరవభట్ల శివరామ్, డాక్టర్ విజయాదిత్య, శిరీషా రఘురామ్, ధవళ సర్వేశ్వరరావు, డాక్టర్ అయ్యగారి రాఘవరావు, డాక్టర్ జక్కు రామకృష్ణ, సోమేశ్వరరావు, డాక్టర్ హరిచందన్, భాస్కరరావు, నీలాద్రి, ప్రసాద్, సాహితీవేత్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్షణమొక యుగం

- ఫలితాల కోసం నాయకులు, కార్యకర్తల ఎదురుచూపు
- ఏ ఇద్దరు కలిసినా పార్టీల గెలుపోటములపైనే చర్చ

విజయనగరం: ప్రస్తుతం రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు గడియారం నెమ్మదించినట్లు, రోజులో 24 గంటలు గడవటానికి 72 గంటలు పడుతున్నట్లు.. వారం నెలలా సాగిపోతున్నట్లు అనిపిస్తోందట. పగలు కాలక్షేపం కాదు.. రాత్రుళ్లు నిద్రపట్టదు.. ఇలా అదో రకమైన రుగ్మత ఆవహించినట్లు చెబుతున్నారు. రాజకీయ పిచ్చి ఉన్న నలుగురు కలిస్తే చాలు జూన్ 4కు ఇంకెన్ని రోజులున్నాయో లెక్కేసుకుంటూ ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

ఎవరో ఒకరు వచ్చి..

ఎన్నికల ప్రచారం, పోలింగ్ తేదీ నాటికి గిర్రున తిరిగిన గడియారం ముల్లు.. అదేమిటో ఇప్పుడు గట్టిగా ముందుకు తోసినా కదలలేనంటోందంటూ భారంగా మారిన తమ దినచర్యపై నిట్టూర్చుతున్నారు. పోలింగ్‌కు, ఫలితాలకు మధ్య దాదాపు 22 రోజుల వ్యవధి ఉండటం అందరిని నిరాశకు గురిచేస్తోంది. ఏదో ఒక వ్యాపకంతో రోజు వెళ్లదీద్దామంటే.. ఎవరో ఒకరు వచ్చి ఎన్నికలకు సంబంధించిన తాజా వార్తలు, పోలింగ్ పరిణామాలు, అనంతర ఘటనలు, వాటి వెనుక జరిగిన వ్యవహారాలు గుర్తు చేసి, ఆలోచనలన్నీ అటువైపే మళ్లేలా చేస్తున్నారు.

రోజూ వాకబులే..

ఎవరు ఏమనుకుంటున్నారు.. ఈ సారి ఎన్నికల్లో ఏ వర్గం ఎటువైపు మళ్లింది.. మహిళల ఓట్లు మనకు వరమేనా? యువ ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపారు. బూత్‌ల వారీగా పోలైన ఓట్లు ముందు పెట్టుకొని, అక్కడున్న బలాబలాలను బేరీజు వేస్తూ, లాభనష్టాలపై అంచనాలు వేస్తున్నారు. ప్రసార మాధ్యమాల్లో నిపుణుల విశ్లేషణలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇస్తున్న మనోబలంతో గెలుపుపై ఒకింత ధైర్యం తెచ్చుకుంటూ రోజులు గడిపేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు రోజుకో సంస్థ సర్వేలు విడుదల చేస్తున్నాయి. వాటిలో ఉన్న వివరాలు చూసి గందరగోళానికి గురికావాల్సి వస్తోంది. బరిలో ఉన్న వారిలో కొందరు సొంతంగా సర్వేలు చేయించుకుంటున్నారు. ఐవీఆర్ఎస్ ద్వారా వచ్చే ఫోన్ కాల్‌కు రాజకీయ ఆసక్తి ఉన్నా వారు మాత్రమే స్పందిస్తున్నారు. సామాన్య ఓటరు ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో దానిపై కూడా నమ్మకం కుదరక ఉత్కంఠకు లోనవుతున్నారు.

విజయనగరం నియోజక వర్గం పరిధిలో 257205 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 184780 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 94,874 మంది మహిళలు, 89899 మంది పురుషులు, 7 గురు ఇతరులు ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో ఉన్నారు. 71.84 శాతం పోలింగ్ నమోదైంది. అధిక శాతం పోలింగ్ నమోదు అంశం తమకు కలిసి వస్తుందని వైఎస్సార్‌సీపీ నాయకులు అంటున్నారు. మహిళలకు గడిచిన ఐదేళ్లలో అందించిన సంక్షేమ ఫలాలు శ్రీరామరక్షగా నిలుస్తాయని కోటి ఆశలతో ఉన్నారు.

క్లుప్తంగా

సామూహిక వ్రతం


వ్రతం చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేటలోని వీరవెంకట సత్యనారాయణస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి సన్నిధిలో వేకువజాము నుంచి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. స్వామి సన్నిధిలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను ఆచరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

విజయనగరం అర్బన్: యోగాసనాలు వేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు జ్ఞాపక శక్తి పెరుగుతుందని సహజ యోగ ట్రస్ట్ సభ్యులు సూరిబాబు, రామారావు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం యోగాసనాలపై పిల్లలకు అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలతో యోగాసనాలు వేయించారు. ఇంట్లో ఆడుకొనే చదరంగం, వైకుంఠపాళీ తదిరత ఆటలను పిల్లలతో ఆడించారు. అనంతరం కథలు చదివించడం, పిల్లలతో కథలు చెప్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీనివాస్, భాష గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తుప్పల తొలగింపు


వ్యర్థాల తొలగింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న కమిషనర్ బాలాజీప్రసాద్

నెల్లిమర్ల: స్థానిక ఈవీఎం గోదాం వద్ద వ్యర్థాలు, తుప్పలను నగర పంచాయతీ సిబ్బంది ఆదివారం తొలగించారు. కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ పనులను పర్యవేక్షించారు. గత కొన్ని నెలలుగా ఈవీఎం గోదాం పరిసరాల్లో తుప్పలు, వ్యర్థాలు పెరిగిపోయి ఇబ్బందిగా ఉండటంతో వాటిని తొలగించారు.

జిందాల్ లేఆఫ్‌ను ఎత్తేయాలి


కర్మాగారం గేటు వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని జిందాల్ స్టెయిన్‌లెస్‌స్టీల్ కర్మాగారం లేఆఫ్‌ను తక్షణమే ఎత్తేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈనెల 17వ తేదీ ఉదయం కర్మాగారం ఆకస్మికంగా లేఆఫ్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. నాటి నుంచి కర్మాగారం ప్రధాన గేటు వద్ద కార్మికులు ఆందోళన చేస్తూ, వంటా వార్పు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కార్మికులు తమ డిమాండ్లను జిల్లా లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ డిమాండ్లపై యాజమాన్యం తమ వైఖరిని 29వ తేదీన తెలియజేస్తామని ఇప్పటికే ప్రకటించింది. కార్మిక సంఘం జేఏసీ నాయకులు ఆదివారం మాట్లాడుతూ యాజమాన్యం సానుకూలంగా వ్యవహరించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. 29వ తేదీన జరగబోయే రెండో దఫా చర్చల్లో యాజమాన్యం సానుకూలంగా వ్యవహరించక పోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కర్మాగారం ప్రారంభం నుంచి పని చేస్తున్నామని, ఇప్పుడు అర్ధంతరంగా కర్మాగారాన్ని మూసేసి మరో రాష్ట్రంలో ఉన్న యూనిట్‌కు కార్మికులను తరలించాలని యాజమాన్యం చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

సత్తా చాటిన వేపాడ విద్యార్థినులు


మెడల్స్ సాధించిన విద్యార్థినులు

వేపాడ: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ -13 విభాగం బాలికల కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో వేపాడ శ్రీవిక్టరీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు సత్తా చాటారు. ఈ పోటీల్లో విక్టరీ స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 7వ తరగతి విద్యార్థినులు వి.స్నేహిత రజత పతకం, ఏ.యామిని కాంస్య పతకం సాధించారని స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ శివ ప్రసాద్ రాఘవ తెలిపారు. విద్యార్థినులతో పాటు కోచ్ శ్రీనివాస్, పీఈటీ రామును పాఠశాల యాజమాన్యం అభినందించింది.